

ఇదీ పరిస్థితి..

జిల్లావ్యాప్తంగా 25,732 మంది ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఉన్నారు. సచివాలయ ఉద్యోగులు 5,240 మంది, విద్యాశాఖలో 4,396 మంది, వైద్య ఆరోగ్య శాఖలో 2,256 మంది, పోలీస్ శాఖలో 836 మంది, రెవెన్యూలో 610 మంది ఉన్నారు. అలాగే పురపాలక శాఖలో 712 మంది, పంచాయతీరాజ్ శాఖలో 472 మంది, ఖజానా శాఖలో 71మంది, రిజిస్ట్రేషన్ శాఖలో 69 మంది ఉన్నారు. ఇలా, ఆర్టీసీతోపాటు ఇతర శాఖల్లో వందలాది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 2004 తరువాత కొలువులు పొందిన ప్రతీ ఉద్యోగిని సీపీఎస్ పరిధిలో చేర్చారు. జిల్లాలో మొత్తం ప్రభుత్వ ఉద్యోగుల్లో 60శాతానికిపైగా సీపీఎస్‌లో ఉన్నవారే. వీరికి అంతకు ముందు ఉద్యోగులకు వచ్చిన పదవీ విరమణ బెనిఫిట్స్ రావు. సీపీఎస్ విధానానికి లోబడి మాత్రమే పింఛన్ ఇస్తారు. ఉద్యోగుల మూల వేతనంతో సంబంధం లేకుండా వారు ఏళ్ల తరబడి పొదుపు చేసుకున్న నగదును పెట్టుబడిగా ఉంచుతారు. అందులో 60 శాతం పదవీ విరమణ ప్రయోజనాలుగా, 40 శాతం స్టాక్‌మార్కెట్ తరహాలో ప్రభుత్వం పొదుపు చేస్తుంది. ఇందులోనే లెక్క కట్టి పింఛన్ అందిస్తారు. దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో గ్యారెంటీ పెన్షన్ స్కీంను తెరపైకి తెచ్చారు. పదవీ విరమణ సమయంలో దాచుకున్న మొత్తంలో 60 శాతాన్ని అందిస్తారు. మిగిలిన 40 శాతాన్ని లెక్కకట్టి పింఛన్‌గా అందించనున్నారు. అయితే ఇది కూడా సీపీఎస్‌కు దగ్గరగా ఉండడంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయినా ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు సరికదా.. ఉన్న రాయితీలు సైతం నిలిపేసింది. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ తీరుపై మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. '1982లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు పెన్షన్.. ఉద్యోగుల హక్కు. ఇది పాలకుల భిక్ష కాదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. సీపీఎస్, జీపీఎస్ విధానాల ద్వారా ఉద్యోగుల సామాజిక భద్రతపై వేటు వేయడం సరికాదు. సీపీఎస్.. ఉద్యోగుల పాలిట శాపం. సీపీఎస్ స్థానంలో తీసుకువచ్చిన జీపీఎస్ కూడా అంకెలగారడీ తప్ప ఎటువంటి ఉపయోగం లేదు. పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) పునరుద్ధరించే వరకూ పోరాటం కొనసాగిస్తామని' ఉద్యోగులు, ఉపాధ్యాయులు స్పష్టం చేస్తున్నారు. హామీని నెరవేర్చని వైసీపీకి.. ఈ సారి ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సన్నద్ధమవుతున్నారు.

● ఉద్యోగికి ఎంత మేలు చేయాలో అంత చేసేయాలి. వారి కళ్లల్లో ఆనందం నింపాలి. అప్పుడే వారు ప్రజలకు మెరుగైన సేవలందించగలరు. చంద్రబాబు ఉద్యోగులను దారుణంగా వంచించారు. సీపీఎస్ రద్దు విషయంలో కమిటీలతో కాలయాపన చేశారు. మేము అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో.. సీపీఎస్‌ను రద్దుచేస్తాం.

-2019లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీ ఇది.

● సీపీఎస్ రద్దు సాంకేతిక అంశం. అందులో చాలా సమస్యలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకోకుండా సీఎం జగన్ హామీ ఇచ్చారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలుచేస్తే... చెల్లింపులకు రాష్ట్ర బడ్జెట్ కూడా సరిపోదు.

-2021 డిసెంబరు 15న ఉద్యోగ సంఘాల నేతలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన మాటలివీ.



సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయుల ధర్నా (ఫైల్)

- అటకెక్కిన సీపీఎస్ రద్దు హామీ
- మాటతప్పిన సీఎం వైఎస్ జగన్
- ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మోసం

వారమన్నారు.. ఐదేళ్లయినా లేదు!

(కాశీబుగ్గ)



వైసీపీ పాలనలో సామాన్య ప్రజలే కాదు.. ఉద్యోగులు, ఉపాధ్యాయు లకు కూడా మోసం తప్పలేదు. ఈ ఐదేళ్లలో ఉద్యోగులు దారుణ వంచనకు గురయ్యారు. గత ఎన్నికలకు ముందు.. తాము అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఈ హామీని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలంతా నమ్మి.. గత ఎన్నికల్లో వైసీపీని గెలిపించేందుకు తమవంతు కృషి చేశాయి. కాగా.. ఇప్పటివరకూ సీపీఎస్ రద్దు చేయకపోవ డంతో గుర్రుగా ఉన్నాయి. 'ఇంకా వారం కాలేదా'? అంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సీఎం జగన్ తీరుపై మండి పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఆందోళ నలు చేశాయి. సీపీఎస్ రద్దు చేసి.. పాత పింఛన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు 2021 డిసెంబరులో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డితో 'క్షమించండి' అంటూ తన మాటగా సీఎం జగన్ ప్రకటించారు. అది సాంకేతిక అంశమని తెలియక మాటిచ్చామని చెప్పుకొచ్చారు. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలంతా నిరాశ చెందుతున్నాయి.

దారుణం



ఐదేళ్లుగా సీపీఎస్ రద్దు కోసం ఎదురుచూశాం. గత ఎన్నికల్లో సీఎం జగన్ ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. ఒక్క క్షమాపణతో మా ఆశలను తుడిచేశారు. ఇంతకంటే దారుణం ఉంటుందా?


- గుంట కోదండరావు, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్

ఐదేళ్లుగా ఉక్కుపాదం




ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎంతో మేలు చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉక్కుపాదం మోపారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన రాయితీలను సైతం రద్దుచేశారు. ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదు.

- ఎస్‌వీ రమణ, యూటీఎఫ్, పలాస శాఖ



9న చంద్రబాబు రాక



● **నరసన్నపేటలో ప్రజాగళం యాత్ర**

నరసన్నపేట, మే 3: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9న జిల్లాకు రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నరసన్నపేటలో ప్రజాగళం యాత్ర నిర్వహించనున్నారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి శుక్రవారం తెలిపారు. నరసన్నపేటలో 9న ఉదయం 11 గంటలకు సభ జరుగుతుందన్నారు. సాయంత్రం 4 గంటలకు చీపురుపల్లి వెళ్తారని, అక్కడ సభ అనంతరం విశాఖపట్నం చేరుకుంటారని తెలిపారు. సభ నిర్వహణకు స్థల పరిశీలన, ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసేందుకు పెద్దఎత్తున కూటమి శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్

● **ఈవీఎంల ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలి: కలెక్టర్ మన్‌జీర్ జిలానీ**

కలెక్టరేట్, మే 3: ఎన్నికల ఉద్యోగులకు సంబంధించి శనివారం నుంచి ఈ నెల 7 వరకు పోస్టల్ బ్యాలెట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ, పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సజావుగా పూర్తి కావాలని ఆదేశించారు. ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. కమిషనింగ్ ప్రక్రియ తరువాత రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి, ఈవీఎంలపై వారికి పూర్తి స్థాయిలో నమ్మకాన్ని కలిగించాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో రంగయ్య, బీవీ.రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఎండలో మాడి.. క్యూలో నిలబడి..

- రెండో రోజూ పింఛన్‌దారులకు పాట్లు
- బ్యాంకుల వద్ద గంటలపాటు నిరీక్షణ
- క్యాష్ పాయింట్ కేంద్రాల్లోనూ పడిగాపులు
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు
- ఇంటికే సొమ్ము అందించాలని వేడుకోలు

(ఇచ్ఛాపురం/ హిరమండలం/ జలుమూరు)

వైసీపీ ప్రభుత్వం వింత పోకడలతో సామాజిక పింఛన్ దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల నిబంధనలు సాకుగా చూపి.. ప్రభుత్వం ఈ నెల నేరుగా లబ్ధిదారులకు పింఛన్ అందజేయకుండా.. వారి బ్యాంకు ఖాతాలో నగదు జమచేసింది. దీంతో ఆ నగదును తీసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు, తదితర పింఛన్‌దారులు ఆపసోపాలు పడుతున్నారు. ఓ వైపు ఎండలు తీవ్రతకు మాడి.. ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరోవైపు బ్యాంకులు, క్యాష్ పాయింట్ కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడి నిరీక్షిస్తున్నారు. బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో గురువారం చాలామంది పింఛన్ డబ్బులు పొందలేకపోయారు. మళ్లీ శుక్రవారం కూడా చాలామంది పింఛన్‌దారులు బ్యాంకులు, క్యాష్‌పాయింట్ల వద్దకు పరుగులు తీశారు. కొంతమంది ఎండకు భయపడి.. ఉదయం 9 గంటలకే బ్యాంకుల వద్దకు చేరుకున్నారు. ఇచ్ఛాపురంలోని వీకేపేట రోడ్డులో ఎస్‌బీఐ, పంజా వీధిలోని ఎస్‌బీహెచ్, దాసన్నపేటలోని యూనియన్ బ్యాంక్, బస్టాండ్ జంక్షన్ వద్ద కెనరా బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. హిరమండలంలో ఎస్‌బీఐ కార్యాలయం, క్యాష్ పాయింట్ వద్ద బారులుదీరారు. జలుమూరు మండలం చల్లవానిపేట ఎస్‌బీఐ వద్ద నిరీక్షించారు. అవగాహన లేక విత్‌డ్రా ఫారాలు నింపేందుకు నానా తంటాలు పడ్డారు. కొంతమంది బ్యాంకు ఖాతాలు వాడుకలో లేక నిలిచిపోవడం.. మరికొంత మంది ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో ఏమిచేయాలో తెలియక సతమతమయ్యారు. ఈ నరకయాతన తాము భరించలేమని, వచ్చే నెల అయినా.. నేరుగా ఇంటి వద్దే పింఛన్ అందజేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఇచ్ఛాపురం : ఎస్‌బీఐ వద్ద పింఛన్‌దారుల నిరీక్షణ



జలుమూరు : చల్లవానిపేట ఎస్‌బీఐ వద్ద పింఛన్‌దారుల పాట్లు



హిరమండలం: ఎస్‌బీఐ వద్ద కిక్కిరిసిన పింఛన్‌దారులు

పడిగాపులు కాస్తున్నాం



పింఛన్ల కోసం గంటల తరబడి బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నాం. ఈ విధానం సరి కాదు. ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్లే మాలాంటి వృద్ధులకు మరింత ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇంటి వద్దకే పింఛన్లు అందించే ఏర్పాట్లు చేయాలి.

- కొయిరమ్మ, ఇచ్ఛాపురం

ఇన్ని పాట్లు పడాలా?



పింఛన్ తీసుకోవాలంటే ఇన్ని పాట్లు పడాలా?. బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నాం. ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నాం. విత్‌డ్రా ఫారం నింపాలన్నా.. ఎవరికో ఒకరికి బతిమాలాడాల్సి వస్తోంది. సచివాలయాల్లో అయినా పింఛన్ అందజేస్తే మంచిది.

- మోహినమ్మ, ఇచ్ఛాపురం

ఉప్పు రైతు.. విలవిల

- ధర లేక నిలిచిన రవాణా
- ఆరేళ్లుగా కానరాని లీజు రెన్యువల్
- పట్టించుకోని ప్రభుత్వాలు

(సంతబొమ్మాళి)

సంతబొమ్మాళి మండలంలోని నౌపడ ఉప్పు పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు దేశంలోనే ప్రముఖ ఉప్పు గల్లీగా భాసిల్లింది. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఉప్పు కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి రాయితీలు అందించకపోవడతో ఉప్పు పరిశ్రమ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఉప్పు రైతులకు ఆటంకాలు.. అవరోధాలు వేధిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఉప్పు భూముల లీజులు 2018 సంవత్సరం నుంచి రైతులకు రెన్యువల్ చేయలేదు. దీంతో చాలామంది ఉప్పురైతులు ఉపాధి కోసం వలస పోయారు. గ్రామాల్లో ఉన్న కొద్దిమంది రైతులు ఉప్పు పండిస్తున్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలను చవిచూస్తున్నారు.

● సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు, మర్రిపాడు, శెలగపేట, సీతానగరం, నౌపడ, యామలపేట, ఆర్.సున్నాపల్లి, మూలపేట, ఆకాశలక్కవరం వంటి గ్రామాల్లో రైతులు గతంలో 5వేలకుపైగా ఎకరాల్లో ఉప్పును పండించేవారు. ఇక్కడి నుంచి ఉప్పును ఒడిశా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు రవాణా చేసేవారు. కాగా.. కేంద్రం ఉప్పు భూముల లీజును రెన్యువల్ చేయకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రస్తుతం 2వేల ఎకరాల్లో మాత్రమే ఉప్పు పండిస్తున్నారు. ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో ఉప్పు రవాణా నిలిచిపోయింది. రెండేళ్ల కిందట 50 కేజీల ఉప్పు బస్తా రూ.250 ఉండగా.. ఈ ఏడాది రూ.120 మాత్రమే పలుకుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి వ్యయం పెరగ్గా.. ఆ స్థాయిలో ధర లేకపోవడంతో నష్టపోతున్నామని వాపోతున్నారు. దీంతో కొంతమంది రైతులు ఉప్పును విక్రయించకుండా నిల్వ చేస్తున్నారు. అలాగే గతంలో ఒడిశా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు ఉప్పు తరలించేందుకు రైల్వేలైన్ ఉండడంతో రవాణా ఖర్చులు తక్కువయ్యేవి. కొన్నేళ్ల కిందట రైల్వేలైన్ తొలగించడంతో లారీల ద్వారా రవాణా ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు ధర కోసం ఆందోళన చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తమను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



గిట్టుబాటు ధర కల్పించాలని ఉప్పు రైతుల డిమాండ్ (ఫైల్)



ధర లేక పేరుకుపోయిన ఉప్పు నిల్వలు

గిట్టుబాటు ధర కల్పించాలి



ఎన్నో వ్యయ ప్రయాసలు పడి పండించిన ఉప్పు పంటకు సరియైన ధర లేక నష్టపోతున్నాం. పంట అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నౌపడ ఉప్పు పరిశ్రమకు జీవం పోయాలి. ఉప్పునకు గిట్టుబాటు ధర కల్పించాలి.

-కర్రి చినబాబు, రైతు, నౌపడ

జగనన్నా.. బస్సులేవీ?



ఇటీవల జరిగిన సీఎం సిద్ధం సభకు జనాలను తీసుకువచ్చేందుకు మారుమూల గ్రామాలకు వెళ్తున్న బస్సు

ఆదాయం ముఖ్యం కాదు ప్రజారవాణా ముఖ్యం. మారుమూల గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం కల్పిస్తామని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కొత్త సర్వీసులు దేవుడెరుగు ఉన్న బస్సులను సర్కారు నిలిపివేస్తోంది. రోడ్డు సదుపాయం ఉన్న గ్రామాలకు కూడా బస్సులు నడపడం లేదు. ఫలితంగా బస్సు ముఖం చూడని పల్లెలు ఎన్నో ఉన్నాయి. దీంతో ప్రజలు ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ ప్రమాదాల బారిన పడడడంతో పాటు వారి జేబులకు చిల్లు కూడా పడుతోంది. ఇది రాష్ట్ర సర్కారు నిర్లిప్తతకు అద్దంపడుతోంది.

(నందిగాం)

జిల్లాలోనే ఎక్కువ భాగం జాతీయ రహదారి-16 నందిగాం మండలంలోనే ఉంది. ఈ మండలం మధ్యగుండానే హైవే వెళ్తోంది. చాలా గ్రామాలకు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రూ.కోట్లు ఖర్చుచేసి రహదారులు నిర్మించారు. అయితే, ఈ రూట్లలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. కొన్నిచోట్ల జాతీయ రహదారి నుంచి లింకురోడ్లు నిర్మించ కపోవడంతో ఆర్టీసీ బస్సులు రావడం లేదు. దీంతో గ్రామీణ, కొండల ప్రాంత ప్రజలు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. అధిక చార్జీలు చెల్లించి పలాస, టెక్కలి తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. మండల కేంద్రం నందిగాంలో తప్ప ఎక్కడా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నిలపడం లేదని, దీనివల్ల విశాఖ, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అగచాట్లకు గురవుతున్నామని ఆవేదన చెందుతున్నారు.



పెంటూరు, పొల్లాడ వయా శివరాంపురం రహదారిపై ఆటోలో వెళ్తున్న ప్రయాణికులు

- పల్లెల ముఖం చూడని ఆర్టీసీ సర్వీసులు
- రోడ్లు ఉన్నా నడపని సర్కారు
- ఉన్న బస్సులను నిలిపివేస్తున్న వైనం
- ప్రజలు, విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- ఆటోలు, ప్రైవేట్ వాహనాలే దిక్కు

ఆటోలపైనే ఆధారం..

● నందిగాం-హూండి, నరేంద్రపురం-వల్లభరాయుడుపేట, పెంటూరు - పొల్లాడ వయా శివరాంపురం జాతీయరహదారి నుంచి జల్లపల్లి వయా దేవళభద్ర, జాతీయరహదారి - రాంపురం వయా సొంటినూరు తదితర కూడళ్ల నుంచి పక్కా రహదారులను టీడీపీ హయాంలో నిర్మించారు. కానీ, ఆర్టీసీ బస్సులు మాత్రం తిరగడం లేదు. దీంతో ఈ గ్రామాలకు ఆటోలే దిక్కుగా మారాయి.



నందిగాం-హూండి వయా కణితివూరుకు రహదారి ఉన్నా నడవని బస్సులు

● జాతీయ రహదారి నుంచి బడగాం-సవరలింగుపురం ఎనిమిది కిలోమీటర్లు మేర పక్కా రహదారి సౌకర్యం కల్పించారు. ఈ మార్గంలో కాశీరాజుకాశిపురం, బడగాం, సవర బడగాం, మొగిలిపాడు, సవరలింగుపురం గ్రామాలకు చెందిన 3వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. అయినా ఆర్టీసీ బస్సులు మాత్రం నడపడం లేదు.

● దశాబ్దాలుగా నిర్మాణానికి నోచుకోని కాపుతెంబూరు-హకుంపేట రహదారి టీడీపీ హయాంలోనే పూర్తిచేశారు. నాలుగు కిలోమీటర్ల మార్గంలో సింగుపురం, గోపాలపురం తదితర గ్రామాలకు చెందిన 3వేల వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. బస్సులు లేకపోవడంతో ప్రజలు ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

● తురకలకోట జాతీయ రహదారి నుంచి బోరకుభద్ర, వెంకన్న పేట, మాదిగాపురం నుంచి హరిదాపురం, ఆనందపురం ఐదు కిలో మీటర్లు రహదారిని టీడీపీ పాలనలోనే పూర్తి చేశారు. దశాబ్దాలుగా మట్టిరోడ్లుగా ఉండే ఈ మార్గంలో బీటీరోడ్డు వేసి జాతీయ రహదారికి అనుసంధానం చేశారు. అయితే ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో 4 వేలమంది ప్రైవేటు వాహనాలపై ఆధారపడుతున్నారు.

● టీడీపీ హయాంలో పలు కీలక గ్రామాలకు పక్కా రహదారి సౌకర్యం కల్పించారు. అప్పట్లో టెక్కలి డిపో నుంచి వల్లభరాయుడుపాడు తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. దీంతో విద్యార్థులు కళాశాలలకు వెళ్లేందుకు అవస్థలు తప్పేవి. అయితే, వల్లభరాయుడుపాడు, జల్లపల్లి తదితర పల్లెలకు సైతం ఆర్టీసీ సర్వీసులను కరోనా సమయంలో రద్దు చేసి నేటికీ కూడా పునరుద్ధరించలేదు. ఆర్టీసీ సేవలు నిలిపివేయడంతో ఆయా గ్రామాల నుంచి జాతీయ రహదారికి ఆటోల్లో చేరుకుని అక్కడి నుంచి పలాస, టెక్కలి వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు.

● కరోనా తర్వాత ప్రైవేటు వాహనాల ఆపరేటర్లు చార్జీలు భారీగా పెంచేశారని విద్యార్థులు, మహిళలు చెబుతున్నారు. రోజుకు రూ. 50 వరకు చార్జీలకు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ముఖ్యనేతల పర్యటనలకే బస్సులు..

ఎన్నికల సమయంలో, ముఖ్యనేతల పర్యటనల సందర్భాల్లో ఆర్టీసీ బస్సులను టెక్కలి, పలాస డిపోల నుంచి జనసమీకరణకు వినియోగిస్తున్నారు. జిల్లా, నియోజకవర్గ, జోనల్ స్థాయిలో జరిగే సభలు, సదస్సులకు అవసరమయ్యే జనసమీకరణ కోసం మారుమూల పల్లెలకు సైతం ఆర్టీసీ బస్సులను పంపిస్తున్నారని, కానీ, తమ అవసరాల కోసం ఎందుకు సర్వీసులు నడపడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామీణ రూట్లల్లో ఆర్టీసీబస్సులు లేకపోవడంతో విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు చేరుకోవడానికి అవస్థలు పడుతున్నారు.

కంచిలి: అని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా కంచిలి మండలంలో పలు గ్రామాల ప్రజల పరిస్థితి తయారైంది. గ్రామాలకు చేరుకోవడానికి రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సులు నడిపేందుకు ఆ సంస్థ ముందుకు రావడం లేదు. రహదారులు ఉన్న ప్రతి గ్రామానికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని ఎన్నికల ముందు వైసీపీ నాయకులు ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయి. గతంలో సోంపేటలో ఉండే సబ్‌డిపోను సైతం ఎత్తేశారు. దీంతో పూర్తిగా అన్ని సర్వీసులు పలాస డిపో నుంచే నిర్వహించాల్సి వస్తోంది. డిపో పరిధి ఎక్కువ కావడం, పూర్తిగా గ్రామీణ రూట్లు కావడంతో ఆదాయం లేదని షాకుతో సర్వీసులు నిలిపి వేస్తున్నారు.

రోడ్లు నిర్మించినా..

కంచిలి నుంచి సుమారు 30 పంచాయతీలకు పూర్తిస్థాయిలో రహదారి సౌకర్యం ఉన్నా ఆర్టీసీ సేవలను ఆ సంస్థ ప్రారంభించడం లేదు. గతంలో రహదారులు లేవని, ఆక్యుపెన్సీ లేదని ఆ సంస్థ అధికారులు బస్సులు నడిపేందుకు ముందుకువచ్చే వారు కాదు. టీడీపీ హయాంలో కంచిలికి సుదూరంగా ఉన్న గిరిజన, మైదాన గ్రామాలకు సైతం పూర్తిస్థాయిలో తారురోడ్లు నిర్మించారు. అయినా వైసీపీ ప్రభుత్వం నువాగుడ, కొనక, గంగాధరపురం, భైరిపురం, జలంత్రకోట, గోకర్ణపురం, శాసనాం, ఉద్దానంలోని పెద్దశ్రీరాంపురం, పెద్దకొజ్జిరియా తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించ లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆటోలు, ప్రైవేటు వాహనాలపై ఆధారపడుతున్నారు. ఇదే ఆసరాగా చేసుకుని ప్రైవేటు ఆపరేటర్లు ఎక్కువ చార్జీలువసూలు చేస్తున్నారని గిరిజనులు వాపోతున్నారు.

ప్రైవేటు వాహనాలపైనే ఆధారం

● కంచిలికి సుదూరంలో ఉన్న ఎంఎస్‌పల్లి, గంగాధరపురం గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నా, అరకొరగానే సేవలు అందుతున్నాయని ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం ఒకసారి మాత్రమే బస్సులు నడుపుతున్నారు.

● సోంపేట నుంచి తలంతపరం, మాణిక్యపురం మీదుగా పెద్దశ్రీరాంపురం బస్సు సర్వీసు గతంలో రెండుసార్లు తిరిగేది. ప్రస్తుతం ఒక సారి మాత్రమే నడుస్తోంది. దీంతో ఈ రూట్‌లోని గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులు కొన్నిసార్లు కాలినడకన గమ్యస్థానాలకు చేరుకోవల్సి వస్తోంది.

● జలంత్రకోట పంచాయతీ పరిధిలోని నువ్వాగడ, పరిసర గ్రామాలకు సైతం బస్సు సర్వీసులు లేక విద్యార్థులు సకాలంలో కళాశాలలకు చేరుకోలేకపోతున్నారు. కెశాసనం, గోక ర్ణపురం, బూరగాం, కుత్తమ, కత్తివరం గ్రామాలకు బస్సు సౌకర్యంలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రైవేటు వాహనాలకు ఆశ్రయించాల్సి వస్తోంది.

● ఆర్టీసీ సర్వీసులు అరకొరగా నడుస్తుండడంతో అత్యవసర సయమాల్లో అవస్థలు తప్పడంలేదు. మారుమూల గ్రామాల నుంచి కంచిలి చేరుకోవడానికి గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

● బొగాబెణి, జెన్నాపయి, నువ్వాగడ తదితర గిరిజన గ్రామాలు, కాలనీలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలపై ఆధారపడాల్సి వస్తోంది. కొందరు ఆటో డ్రైవర్లు ప్రమాదమని తెలిసినా ముందు, వెనుకభాగంలో ప్రయాణికులను వేలాడేలా ఎక్కించి గమ్యస్థానాలకు చేరుస్తున్నారు.

● సోంపేట నుంచి ఇచ్ఛాపురం, బరంపురం వైపు వెళ్లే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కంచిలిలోకి రాకుండా బైపాస్ నుంచి వెళ్లిపోతున్నాయి. బరంపురం వైపు నుంచి సోంపేట, విశాఖపట్నం వైపు వెళ్లే ఆర్టీసీ సర్వీసులు సైతం కంచిలి రాకపోవడంతో ప్రయాణికులంతా సోంపేట వెళ్లి బస్సులు ఎక్కాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో రెండు మార్గాల్లో ఎక్స్‌ప్రెస్‌లు కంచిలి వచ్చే హైవే మీదుగా వెళ్లేవి. ప్రస్తుతం కంచిలిలోకి రాకుండా వెళ్లిపోతుండడంతో 30 పంచాయతీల ప్రయాణికులు అగచాట్లకు గురవుతున్నారు.



7,8 తేదీల్లో తొలివిడత హోం ఓటింగ్

గార: వివిధ ప్రతిభావంతులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులకు కేంద్ర ఎన్నికల సంఘం హోం ఓటింగ్ సదుపాయం కల్పించింది. వీరు పోలింగ్ కేంద్రానికి వెళ్లే అవకాశం ఉంటే సరే, లేదంటే అధికారులు ఇంటి వద్దకే వచ్చి వారి ఓటును వినియోగించుకునేలా ఈసీ రూప కల్పన చేసింది. సర్వేలో గుర్తించిన వారి ఇళ్లకు పోలింగ్ అధికారులు వెళ్లి వారి దగ్గర ఉండి ఓటు వేసేలా చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు తొలివిడత మే 7,8 తేదీల్లో హోం ఓటింగ్ జరగనుంది. ఈ రెండు తేదీల్లో ఓటు వేయలేని వారికి మరోసారి 8,10 తేదీల్లో ఓటు వేసేలా ఎన్నికల సంఘం ప్రణాళిక రూపొందించింది. కార్యక్రమానికి ఏఆర్వో పర్యవేక్షణాధికారిగా వ్యవహరిస్తారు. సహాయకులుగా సెక్టోరియల్ అధికారులు, బీఎల్వోలు పోలీసు సిబ్బంది, వీడియో గ్రాఫర్లు, పోలింగ్ కేంద్రాల పరిధి ఏజెంట్లు ఉంటారు.



పోలింగ్‌ను బహిష్కరిస్తే రీపోలింగ్ ఉండదు

(నరసన్నపేట/హరిపురం)

ఏ కారణం చేతైనా పోలింగ్ ప్రారంభం కావడం ఆలస్యమయితే పోలింగ్ సమ యాన్ని పెంచరు. నిర్దిత సమయానికి క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అనుమతిస్తారు. ఎంత రాత్రైనా సరే వారంతా ఓటు వేసే వరకూ పోలింగ్ కొనసాగుతుంది. పోలింగ్ కేంద్రంలో గాని, కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో గాని అభ్యర్థితోపాటు ఏ వ్యక్తి కూడా పలానా గుర్తు, వ్యక్తికి ఓటు వేయాలని ప్రచారం చేయడం శిక్షార్హం. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951, సెక్షన్ 130 ప్రకారం నేరం. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏవైనా కారణాలతో ఓటింగ్‌ను బహిష్కరిస్తే రీపోలింగ్ నిర్వహించరు. పోలింగ్ కేంద్రం పరిధిలోగాని, 100 మీటర్ల దూరంలో గాని అభ్యర్థి మీడియాతో మాట్లాడకూడదు. అది చట్టరీత్యా నేరం. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి గన్‌మెన్‌కు అనుమతి లేదు. ఒక వేళ ఓటు వేసేందుకు గన్‌మెన్ వస్తే తన ఆయుధాన్ని బయట ఉన్న పోలీసుల వద్ద ఉంచి ఓటువేసి తిరిగి వచ్చి తన ఆయుధాన్ని తీసుకోవాలి. ఓటు వేసే సమయంలో ఫొటోలు తీయడం, వీడియో చిత్రీకరణ నేరం. ఇది రహస్య ఓటింగ్‌కు భంగం కలిగిస్తుంది.

పదండి.. పదండి..

ఇంకా వారం రోజులే

● ప్రచారం సమయం దగ్గరపడుతుండడంతో స్పీడ్ పెంచిన పార్టీలు ● మేనిఫెస్టో హామీలతో పాటు స్థానిక అంశాలే ప్రచారాస్త్రాలు

(నరసన్నపేట)


ఎన్నికల ప్రచారానికి ఇంకా వారంరోజులే మిగిలిఉంది. సమయం దగ్గర పడుతుండడంతో రాజకీయ పార్టీలు ప్రచా రంలో స్పీడ్‌పెంచాయి. రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలు ప్రకటించడంతో వాటిని అభ్యర్థులు ప్రజలకు వివరిస్తూ తమకు ఓటువేయాలని కోరుతున్నారు. మేనిఫెస్టోలోని హామీలతో పాటు స్థానికంగా ఉండే సమస్యలను ప్రచారాస్త్రాలుగా చేసుకుని ముందుకుసాగుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో జనరంజకంగా ఉండడంతో అభ్యర్థులు ప్రచా రంలో మరింత ఉత్సాహంతో అడుగులేస్తుండగా, వైసీపీ మేనిఫెస్టో పేలవంగా ఉండడంతో ఆ పార్టీ అభ్యర్థులు డీలా పడుతున్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్ల జరిగిన విధ్వంసంపైనే టీడీపీ నాయకులు ప్రధానంగా ఫోకస్ పెట్టి ప్రచారాన్ని సాగిస్తున్నారు. ప్రస్తుతం విజయావ కాశాలు కూటమికే ఉన్నాయని విశ్లేషణలొస్తుండడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జోరందుకున్నాయి. వారిని ఆపడానికి వైసీపీ నాయకులు ఆపసోపాలు పడుతున్నారు. కూటమి మేనిఫెస్టోలో కీలకమైన ఏటా నాలుగు లక్షల ఉద్యోగాల కల్పనతో పాటు నిరుద్యోగ భృతి వంటి అంశాలపై అభ్యర్థులు దృష్టిసారించారు. ఇవే కాకుండా చంద్రబాబుకు ఉన్న ఐటీ బ్రాండ్‌ను కూడా అభ్యర్థులు లక్ష్యంగా చేసుకుని ప్రచారం చేస్తున్నారు.

పగలు ప్రచారం.. రాత్రి మంతనాలు

అభ్యర్థులు పగలంతా ప్రచారం చేస్తున్నారు. రాత్రి చేరికలు తదితర అంశాలపై మంత నాలు సాగిస్తున్నారు. బూత్‌లవారీగా సమీక్షలతో పార్టీకార్యాలయాలు, అభ్యర్థులు ఇళ్లు జాతరను తలపిస్తున్నాయి. మధ్యమధ్యలో ప్రధాన పార్టీల తరపున రాష్ట్రస్థాయి నాయకులు ప్ర చారానికి వచ్చి వెళ్తుండంతో ఆయా పార్టీల శ్రేణుల్లో గెలుపు ధీమా మరింత పెరుగుతోంది.

కూటమి అధికారంలోకి వస్తే..

ఏళ్లుగా పరిష్కారం లభించని అనేక సమస్యలకు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గాడినపెడతామని కూటమినాయకులు హామీ ఇస్తున్నారు. కొద్దిరోజుల కిందట వరకు పార్టీ అభ్యర్థి మాత్రమే ప్రచారం చేసేవారు. ప్రస్తుతం సమయం దగ్గర పడతుండడంతో పార్టీలో ద్వితీయశ్రేణి నాయకులకు గ్రామాల వారీగా ప్రచార బాధ్య తలను అప్పటించారు. ప్రచా రంలో భాగంగా ఇప్పటివరకు టచ్‌చేయని ప్రాంతాలపై దృష్టి పెట్టడంతో పాటు, ప్రతికూలతఉన్న ప్రాంతాల్లో ఇకమీదట ఎక్కువగా ప్రచారం చేయాలని నాయకులు అంచనాకు వచ్చారు. పార్టీ తరపున నియోజవర్గాల్లో ఉన్న పరిశీలకుల సూచనలు, సలహాలు కూడా పాటిస్తూ అభ్యర్థులు దూకుడుపెంచారు.





సోషల్ మీడియాపైనా దృష్టి..

సమయం తక్కువగా ఉండడంతో కోడ్ నిబంధనలు మేరకు సోషల్ మీడియాలో ప్రచారంపై కూడా నాయకులు దృష్టి సారించారు. వారి ఖాతాలను నిర్వహించడానికి ప్ర త్యేకంగా ఓబ్బందాన్ని కొంతమంది అభ్యర్థులు ఏర్పాటుచేసుకున్నారు. సోషల్‌మీడియాలో ఎక్కువగా యువతను ఆకట్టుకునే అంశాలపై దృష్టి సారించారు.

విధ్వంసం, అరాచకాలను గుర్తు చేస్తూ...

ఐదేళ్ల పాలనలో అధికారపార్టీ చేసిన విధ్వంసంతో పాటు అరాచకాలను గుర్తు చేస్తూ కూటమి అభ్యర్థులు ప్రచారం సాగిస్తున్నారు. అరకొరగా అమలు చేసిన సంక్షేమ పథకా లను నమ్ముకుని వైసీపీ అభ్యర్థులు ఓటర్ల ముందుకు వెళ్తున్నారు. గతంలో సామాన్యులతో పాటు వ్యాపార వర్గాలను భయభ్రాంతులకు గురిచేసిన సందర్భాలు, ప్రజాకట్టడాలు కూల్చే వేసిన సంఘటనలను ప్రజల్లో మరోసారి చర్చకు పెడుతూ కూటమి అధికార ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తున్నారు.

ముఖ్యనేతల తాకిడి..

ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ జిల్లాలకు ప్రచారానికి వచ్చే రాష్ట్రస్థాయి నేతల తాకిడి ఎక్కువైంది. ఇటీవల సీఎం జగన్మోహనరెడ్డి టెక్కలిలో పర్యటించగా, పాతపట్నం, ఆమదా లవలస, శ్రీకాకుళంలో చంద్రబాబు ప్రజాగళం, మహిళలతో సమావేశం నిర్వహించారు. తాజాగా జిల్లాలో నారా లోకేష్ ప్రచారం చేపట్టనున్నారు. కాగా ఈవారంలో మళ్లీ చంద్రబా బునాయుడు జిల్లాలో ప్రచారం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

కూడికలు, తీసివేతలతో బిజీబిజీ..

అభ్యర్థులు ప్రచారంలో తలమునకలై ఉన్నారు. వారి వారి పార్టీలు నియోజకవర్గాల వారీగా నియమించిన పరిశీలకులు పంచాయతీలు, బూత్‌లు వారీ బలాబలాలను లెక్కలు వేస్తున్నారు. ప్రతిరోజూ నియోజవర్గంలో పార్టీ పరిస్థితిపై అధిష్ఠానానికి నివేదిక ఇస్తున్నారు. పరిశీలకులు అభ్యర్థులతో సమానంగా పనిచేస్తూ వారి గెలుపు కోసం తెరవెనుక వ్యూహాలు రచించే పనిలో నిమగ్నమయ్యారు.

దత్తత గ్రామంలో తమ్మినేనికి షాక్

● వైసీపీ ప్రచారానికి జనాలు దూరం

● ఆక్రోశం వెల్లగక్కిన స్పీకర్

సరుబుజ్జిలి: మండలంలోని కొండవలస, పెద్దపాలెం, రావివలస, పెద్ద వెంకటాపురం, వీరమల్లిపేట, సింధువాడ, పెద్దసవలాపురం, కొత్తకోట, షలంత్రి, రొట్టవలస గ్రామాల్లో వైసీపీ అభ్యర్థి తమ్మినేని సీతారామ్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయితే, తన దత్తత గ్రామమైన వీరమల్లిపేటలో ప్రజలు ఆయనకు షాకిచ్చారు. ఆయన తన చైతన్య రథంపై గ్రామానికి చేరుకోగా గ్రామస్థులు ఎవరూ అక్కడకు వెళ్లలేదు. ఇటీవల ఈ గ్రామ ప్రజలంతా టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పీకర్ ఎన్నికల ప్రచారానికి వారంతా దూరంగా ఉన్నారు. దీంతో సీతారాం ఆక్రోశం వెల్లగక్కారు. వీరమల్లిపేట గ్రామాన్ని తాను దత్తత తీసుకొని అక్కినేని నాగేశ్వరరావును ఇక్కడకు తీసుకొచ్చి ఎంతో అభివృద్ధి చేసి మోడల్ విలేజ్‌గా రూపొందించానని చెప్పారు. ఎవరో చెప్పిన మాటలు విని తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం మంచిది పద్ధతి కాదని ఆవేశంగా అన్నారు. వైసీపీని అభిమానించే వ్యక్తులను కట్టడం చేయడానికి కొంతమంది బెదరింపులకు పాల్పడడం మంచి పద్ధతి కాదన్నారు. అలా జరిగితే తాటతీస్తానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ శివానందమూర్తి మాట్లాడుతూ.. తాను ఏ తప్పు చేయలేదని, ఎవరైనా తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే ముక్కు నేలకు రాసి అభివృద్ధి కోసం తన ఆస్తులు అమ్మాయినా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆవేశభరితంగా ప్రకటించారు. అయినప్పటికీ కూడా గ్రామస్థులు ఎవరు కూడా వైసీపీ ప్రచారం వద్దకు వెళ్లలేదు. దీంతో గ్రామస్థుల ఐకమత్యంపై అంతా చర్చించుకున్నారు.

ఎంత పనున్నా.. ఆ రోజు రావాల్సిందే




హరిపురం: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువగా కనిపించే ఈ దృశ్యాలే ప్రస్తుతం సార్వ త్రిక ఎన్నికల్లో సైతం కనిపిస్తున్నాయి. ఈసారి ఎన్నికలు రసవత్తరంగా సాగుతున్నాయి. మన అభ్యర్థిని తప్పనిసరిగా మనందరం కలిసి గెలిపించుకోవాలి. మీకు ఎంత పనిఉన్నా ఓటు వేసే సమయానికి మాత్రం ఊరులో ఉండాల్సిందేనని పట్టణాలు, గ్రామాల్లో ఉన్న ఓటర్లను వివిధ పార్టీల కు చెందిన నాయకులు ఫోన్‌చేసి సమాయత్తం చేస్తున్నారు. ఫోన్లు కలవకపో తే మెసేజ్‌ల రూపంలో పిలుస్తున్నారు. మరికొందరు ఒకడుగు ముందుకు వెళ్లి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి పట్టణాల్లోని వలస ఓటర్లపై దృష్టిసారించారు. వారికి రానుపోను చార్జీలు తామే భరి స్తూ.. ఫోన్‌పే, గూగుల్‌పేలో డబ్బు చెల్లించి రప్పిస్తున్నారు. ఈసారి ఇరుపార్టీల మధ్య ఎన్నికలు హోరాహోరిగా జరుగుతుండడంతో ప్రతి ఓటు కీలకంకావ డంతో ఆయా పార్టీల కిందస్థాయి నాయకులు వలస ఓటర్లను రప్పించేందుకు తీవ్రంగా శ్రమిస్తోన్నారు.

భూమి ఉంటేనే ఓటు హక్కు

మీకు తెలుసా?

పోలాకి: రాజ్యాంగం వచ్చిన కొత్తలో ఎన్నికల్లో ఓటు వేయాలన్నా, శాసన సభ్యుడిగా, ఎంపీగా ఎన్నికల్లో పోటీచేయలన్నా సంబంధిత వ్యక్తికి ఎంతో కొంత భూమి ఉండాలని నిబంధన ఉండేది. అప్పట్లో గౌతులచ్చన్న ఎన్నికల్లో పోటీచేసే సమయంలో భూమిలేకపోతే పురుషోత్తపురానికి చెందిన కిల్లి అప్పలనాయుడు వద్ద భూమిని దాఖలు పరచి భూహక్కు పత్రం పొందాక ఎన్నికల్లో పోటీ చేశారు. గౌతులచ్చన్న, తమ్మినేని పాపారావు ఐదుసార్లు ఎన్నికల్లో విజయం సాధించి 25 సంవత్సరాలు ప్రాతినిధ్యం వహించారు. అప్పట్లో 21 సంవత్స రాల నిండినవా రికి విద్యావంతులకే ఓటుహక్కు ఉండేది.

సీనియర్ ఓటరు



అప్పట్లో రాజకీయ విలువలు ఉండేవి

పోలాకి: 'నేను 1962లో రాజకీయాల్లో ప్రవేశించాను. 1952లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన ఓ వ్యక్తి హెలికాప్టర్ ద్వారా గ్రామాల్లో కరపత్రాలను పడేశారు. ఆ కరపత్రం చూసి ప్రజలు ఓట్లు వేశారు. డబ్బుల ప్రసక్తి ఉండేది కాదు. స్వస్తిక్ ముద్రతో బ్యాలెట్ పేపర్‌తో ఓటు వేసే వాళ్లం. ఎన్నికల్లో బూత్ ఖర్చులకోసం రూ.1000 ఇచ్చేవారు. అప్పట్లో ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తులకు గ్రామస్థులు గౌరవంతో విరాళాలిచ్చి ఆర్థికసాయం చేసే వారు. అప్పట్లో ఎమ్మెల్యేకు రూ.వెయ్యి ఎంపీకి రూ.2వేలు, సర్పంచ్‌కు రూ.60 డిపాజిట్ చెల్లించేవారు. ఎమ్మెల్యే, ఎంపీల ఎన్నికలు ఒకేసారి జరిగేవి. అప్పట్లో సాధారణ ఎన్నికల్లో అభ్యర్థులు ఎంత మంది ఉన్నా ఒకే డబ్బాను కేటాయించి ఓటర్లు వారికి నచ్చిన అభ్యర్థికి ఓటు వేసేవారు. అప్పట్లో ఓటు వేసిన వ్యక్తులను అభ్యర్థులు మర్యాదపూర్వకంగా పిలిచి ఫలహారం, లేదా భోజనం పెట్టి పంపించేవారు. డబ్బులు ఇచ్చేవారు కాదు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేవి. సమ స్యాత్మక గ్రామాలను గుర్తించేవారు కాదు. అప్పటి రాజకీయాలకు విలువలు ఉండేవి. ప్రస్తుతం విలువలు లేవు సరికదా అంతా డబ్బుమయం. ఎమ్మెల్యే అభ్యర్థికి అప్పట్లో రూ30వేలు ఖర్చుఅయ్యేది. ప్రస్తుతం రూ.30కోట్లకు చేరింది.'

-పాగోటి అప్పారావు, సీనియర్ సిటిజన్, రాజకీయ విశ్లేషకుడు, దీర్ఘాశి, పోలాకి మండలం

ఎన్నికల ప్రచారంలో కొత్త పంథా

- ఎల్‌ఈడీ స్ర్కీన్లపై కార్యక్రమాల ప్రదర్శన
- సామాజిక మాధ్యమాల్లోనూ పోస్టింగులు

(నరసన్నపేట)



ఎన్నికలంటే గోడమీద రాతలు.. అభ్యర్థుల వివరాలతో కరపత్రాల పంపిణీ.. వీధుల వెంట ర్యాలీలు.. నినాదాలు గతంలో కనిపించేవి.. మెడలో పార్టీ కండువాలు.. నెత్తిన టోపీ.. చేతిలో జెండా ఉండేవి.. ప్రస్తుతం ఇటువంటి ప్రచారాలు కొనసాగుతున్నా.. ప్రచారంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కొత్త మార్గాల్లో వినూత్న రీతుల్లో ప్రచారం సాగుతోంది.

ఎల్‌ఈడీ స్ర్కీన్లతో..

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ప్రచార పంథాను పార్టీలు పూర్తిగా మార్చేశాయి.ఆయా పార్టీల పాలనాకాలంలో చేసిన అభివృద్ధిని వీడియోల ద్వారా చిత్రీకరించి వాటిని ఎల్‌ఈడీ స్ర్కీన్లు కలిగిన వాహనా లను రూపొందించి వాటి ద్వారా ప్రధాన కూడళ్లలో ప్రచారం చేస్తు న్నారు. ప్రతి సెంటర్‌లో కనీసం రెండు గంటలపాటు ఉదయం, రాత్రి సమయంలో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. ఆకర్షణీయంగా ఉన్న ఇటువంటి ప్రచార రథాలను జనం ఆసక్తిగా చూస్తున్నారు. ఇప్ప టికే పార్లమెంట్ నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తన పరిధిలోగల ఏడు అసెంబ్లీ నియోజ వర్గాల్లో ఇటువంటి వాహనాలు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థులు కూడా ఇటువంటి వాహనాలు వినియోగించి ప్రచారం లో దిగారు.

సామాజిక మాధ్యమాలు



ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల వినియోగాన్ని బాగా పెరిగింది. అన్నిపార్టీల అభ్యర్థులు ఇందుకోసం ప్రత్యేకంగా ఓ విభాగాన్ని పార్టీ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరగడం అందులో వాట్సప్‌ను వినియోగిస్తున్న నేపథ్యంలో వారి నెంబర్లను సేకరించి వాట్సప్ మేసేజ్‌లను పంపిస్తు న్నారు. ఫేస్‌బుక్, వాట్సప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారు. రాజకీయపార్టీ నేతలు తమ అభ్యర్థుల ప్రచారాన్ని నిర్వహించుకుంటూనే ప్రత్యర్థుల వైఫల్యాలను ఎండగడుతూ రూపొందిస్తున్న క్యారికేచర్లు, వీడియోలు పంపిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు.

చుక్క నీరు వస్తే ఒట్టు!

- సాగునీరు అందక ప్రతి ఏటా నష్టాలే
- ఐదేళ్లుగా పట్టించుకోని సర్కారు
- కన్నెత్తిచూడని మంత్రి అప్పలరాజు
- పలాస, వజ్రపుకొత్తూరు రైతులకు తప్పని కష్టాలు



టెక్కలిపట్నం వద్ద వంశధార కాలువలో పేరుకుపోయిన తుప్పలు

(పలాస రూరల్)

పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో రైతులు ఎక్కువగా వర్షాధారంపైనే ఆధారపడి సాగు చేస్తుంటారు. వర్షాకాలంలో చెరువుల నిండితేనే ఖరీఫ్‌లో పంటలు పండుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రెండు మండలాల్లోని ఐదువేల ఎకరాలకు సాగు నీరందించాలనే లక్ష్యంతో మూడు దశా బ్దాల కిందట కిడసింగి వరకు వంశధార ఎడమ కాలువను తవ్వారు. గొట్టా బ్యారేజీ నుంచి ఏటా జూన్‌లో ఈ కాలువ ద్వారా నీటిని విడిచిపెట్టేవారు. అయితే ప్రస్తుతం కాలువ అధ్వానంగా తయారైంది. తుప్పలు, ముళ్లకంపలు పెరగ డంతో కాలువలో నీరు పారడం లేదు. 2,400 క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువలు ఏర్పాటు చేసినా ఏనాడు వెయ్యి క్యూసెక్కులు ప్రవహించిన దాఖలాలులేవు. దీనికితోడు కాలువలకు ఎగువ ప్రాంతంలో ఎక్కడికక్కడే నీటి చౌర్యం యథేచ్ఛగా జరుగుతోంది. అంతేకాకుండా పలాస ప్రాంతానికి మదనగోపాలసాగరం నుంచే కాలువల ద్వారా సాగునీరు రావల్సిఉంది. ఈ సాగరం పూర్తిగా తుప్పలు, డొంకలతో నిండిపోవడంతోపాటు షిల్ట్ పేరుకుపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీంతో ఈ సాగరం నుంచి టెక్కలి పరిసరాల్లో ఉన్న కాలువలకు మాత్రమే నీరందుతోంది. టెక్కలి దాటిన తర్వాత నందిగాం మండలంలో పలు చోట్ల నీటిని మళ్లిస్తుండడం, ఎత్తిపోతల పథకాలతో శివారు ప్రాంతాలకు నీరు వెళ్లడంలేదు. గత ఎన్నికల ముందు వైసీపీ నాయకులు పలాస వరకు వంశధార నీటిని తీసుకువస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు.

వంశధార కాలువల ఆధునీకీకరణను వైసీపీ సర్కారు పూర్తిగా మరిచింది. పూడుక, పిచ్చిమొక్కలతో కాలువలు అధ్వానంగా ఉన్నా పట్టించుకోవడం లేదు. ఈ ఐదేళ్లలో కనీస మరమ్మతులకు రూపాయి కూడా విదల్చలేదు. ఫలితంగా పలాస, వజ్రపుకొత్తూరు మండలాల రైతులకు చుక్కనీరు అందడం లేదు. దీంతో ఏటా నష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లినా కన్నెత్తిచూడడం లేదని ఆవేదన చెందుతున్నారు.

చెరువులపై ఆధారం

పలాస మండలంలో ఎక్కువ భాగం చెరువులు, మెట్ట ప్రాంతంలో వర్షాధారంపైనే ఆధారపడి సాగుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వంశధార కాలువ ద్వారా నీరందుతుందని ఆశించిన రైతులకు ఐదేళ్లుగా నిరాశే మిగిలింది. ఏటా ఖరీఫ్‌లో రైతులు వేలాది రూపాయలు అప్పులు చేసి సాగు చేస్తుంటారు. అయితే, పంట చివరి దశలో అక్టోబరు, నవంబరు నాటికి కాలువల ద్వారా నీరు రాకపోవడం, వర్షాలు సైతం ముఖం చాటేస్తుండడంతో పెట్టుబడులు సైతం రాక నష్టపోతున్నామని రైతులు చెబుతున్నారు.

కాలువలో పిచ్చి మొక్కలు

వంశధార ఎడమ కాలువ నీరు పలాస మండలానికి నందిగాం మండలం మీదుగా రావాల్సిఉంది. టెక్కలిపట్నం నుంచి గోపివల్లభాపురం, మర్రిపాడు, కేశుపురం, నారాయణపురం, కేదారిపురం, గంగువాడల మీదుగా పలాస జగన్నాథసాగరానికి దేశబట్టితో కలిసి వచ్చి చివరగా చినబాడం మీదుగా వజ్రపుకొత్తూరు మండలానికి వెళ్తుంది. కాని వంశధార కాలువలో చుక్కనీరు రాకపోవడంతో ప్రస్తుతం పిచ్చిమొక్కలతోపాటు పూడికలు పేరుకు పోయాయి. టెక్కలిపట్నం వద్దగల ప్రధాన వంశధార కాలువకు ఏళ్ల తరబడి మరమ్మతు లకు నోచుకోవడంలేదు.కేశపురం వద్ద ఉన్న కాలువ నిండా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఐదేళ్లుగా కాలువలను కనీసం మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు.కనీసం అధికారులు కాలువలను ఏనాడు పరిశీలించలేదని ఆరోపిస్తున్నారు.

పత్తాలేని అధికారులు

పలాసలో వంశధార కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు.తమ సమస్యలు తెలియజేయడా నికి ఎప్పుడు వెళ్లినా అధికారులు అందుబాటులో ఉండడంలేదని రైతులు వాపోతున్నారు. పలాస మండలం పరిధిలో 18 కిలోమీటర్ల వంశధార కాలువ నాలుగు అడుగుల మేర తుప్పలు పేరుకుపోయాయి. దీంతో మరమ్మతులు లేక ఐదేళ్ల నుంచి చుక్కనీరు అందని పరిస్థితి నెలకొంది.



పలాస మండలం కేశుపురం వద్ద వంశధార కాలువ లో పిచ్చిమొక్కలు

నీరందించి ఆదుకోవాలి

వంశధార కాలువలను వేసవిలోనైనా పూర్తిగా పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించి మరమ్మతులు చేపట్టాలి. ఈఐదేళ్లలో చుక్కనీరు కూడా రాకపోవంతో రైతులకు తీవ్ర నిరాశే మిగిలింది. ఈ ఏడాది పూర్తిగా నష్టం చూసిన రైతన్నలకు కనీసం వచ్చే ఏడాదైనా నీటిని వంశధార కాలువ ద్వారా అందించగలిగితే ఉపయోగకరంగా ఉంటుంది.

-అవుగాన షణ్ముఖరావు, రైతు, మోదుగులపుట్టి

ప్రభుత్వ వైఫల్యమే

ఐదేళ్లలో వంశధార నీరందించకపోవడం వైసీపీ ప్రభుత్వ వైఫల్యమే. శివారు భూములకు నీరందించి ఉంటే రైతులకు ఎంతో మేలు జరిగేది. కనీసం ఒక్క సంవత్స రమైనా నీటిని అందించకపోవడంతో సాగునీటిని అందించడంలో ప్రజాప్రతినిధుల చిత్తశుద్ధి అర్థమవుతోంది.

- వి.దుర్గారావు, జనసేన పలాస నియోజకవర్గ సమన్వయకర్త

విజిలేస్తే పరుగులే..

- పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రం 'సి-విజిల్'
- 100 నిమిషాల్లో ఫిర్యాదుల పరిష్కారం
- రాష్ట్రంలోనే జిల్లాకు ప్రథమస్థానం

(కలెక్టరేట్)

సాధారణంగా ఎన్నికలు అంటే డబ్బు, మద్యం, బహుమతులు చేతులు మారుతుంటాయి. వీటిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. ఎన్నికల సంఘం ఇటువంటి ప్రలోభాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం, పోలీసులతో కలిసి అన్ని రకాల చర్యలు చేపడుతుంది. ఈ నేపథ్యంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఎన్నికల సంఘం కూడా టెక్నాలజీని అందిపుచ్చుకుని, ఎన్నికల్లో రాజకీయ పార్టీల నాయకులు ఎవర్నీ ప్రలోభ పెట్ట కుండా ఉండేందుకు సీ-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇది పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రంగా మారింది. ఈ విజిల్ ఊదితే అధికారులు పరుగులు పెట్టాల్సివస్తోంది. దీని ద్వారా దేశంలో ఏ మూలన ఉన్న పౌరుడైనా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో దాన్ని పరిష్కరించడం దీని ప్రత్యేకత. ఇలా రాష్ట్రంలో ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో 98 శాతం కేసులను పరిష్కరించి శ్రీకాకుళం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.

624 ఫిర్యాదులు

జిల్లాలో మార్చి 16న నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి ఇప్పటివరకు 624 ఫిర్యా దులు సి-విజిల్ యాప్ ద్వారా నమోదయ్యాయి. మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఫ్లయింగ్‌స్క్వాడ్లు వాటిని పరిష్కరించాయి. మొత్తం ఫిర్యాదుల్లో 187 కేసులను ఫేక్ కేసులుగా గుర్తించగా, 437 కేసులను సరైనవిగా నిర్ధారించారు.

పలాసలో ఎక్కువ

సి-విజిల్ ద్వారా నమోదైన ఫిర్యాదుల్లో ఎక్కువగా పలాస నియోజకవర్గం నుంచి వచ్చాయి. ఇక్కడ మొత్తం 269 ఫిర్యాదులు రాగా అందులో 107 ఫేక్ అని అధికారులు గుర్తిం చారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో అతి తక్కువగా ఎనిమిది రాగా ఇందులో ఒకటి ఫేక్ అని గుర్తించారు. ఆమదాలవలసలో 94, ఇచ్ఛాపురంలో 85, నరసన్నపేట 90, శ్రీకాకుళంలో 20, టెక్కలి నియోజకవర్గంలో 47 ఫిర్యాదులు సి-విజిల్ ద్వారా నమోదయ్యాయి.

యాప్‌లో అప్‌లోడ్ చేస్తే..

సి-విజిల్ అనేది మొబైల్ ఆధారంగా పనిచేసే ఒక యాప్. దేశంలోని ప్రతిపౌరుడు తన ముందు జరిగే ఎన్నికల సమయంలో జరిగే ఉల్లంఘనలు, అక్రమాలను నేరుగా దీని ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఓటర్లను మభ్యపెట్టేందుకు రాజకీయ పార్టీలు, ఎన్ని కల్లో పోటీచేసే అభ్యర్థులు అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడం, అభ్యర్థుల దుష్ప్రవర్తన వంటి వాటిపై ఈసీ దృష్టికి తీసుకువెళ్లవచ్చు. వాటికి సంబంధించిన ఫొటోలు,



వీడియోలను తీసి సి-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే.... ఎన్నికల అధికారులకు చేరుతుంది. ఈ ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో ఎన్నికల సంఘం అధికారులు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటారు.

ఫిర్యాదు చేయడం ఎలా..

గూగుల్ ప్లేస్టోర్ నుంచి సీ-విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి. అందులో మన వివరాలతో లాగిన్ అవ్వాలి. ఆ తర్వాత ఎక్కడైనా ఉల్లంఘనలు, ప్రలోభాలు జరిగితే వాటిని రహస్యంగా సెల్‌ఫోన్‌లో ఫొటోలు, వీడియోతీయాలి. వాటిని సి-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసి వివరాలు వెల్లడించాలి. రెండునిమిషాల నిడివి ఉన్న వీడియోలను కూడా అప్‌లోడ్ చేసే అవకాశం ఉంటుంది. వీడియోలు అప్‌లోడ్‌చేసే సమయంలో సెల్‌ఫోన్‌లో జీపీఎస్ తప్పనిసరిగా ఆన్ చేసిఉంచాలి. అభ్యర్థులు, స్థానిక నాయకులు ఎవరైనా వచ్చి తమ పార్టీకే ఓటువేయాలని డబ్బులు పంచేందుకు ప్రయత్నించినా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఎన్నికల ప్రచారంలో నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీల్లో విద్వేష పూరిత వ్యాఖ్యలు చేసినా, మోడల్ కోడ్ ఉల్లంఘించినా ఫిర్యాదు చేయవచ్చు. ప్రతి ఫిర్యాదు కు ఒక యూనిక్ ఐడి నెంబర్ ఇస్తారు. దాని ద్వారా ఫిర్యాదు స్థితిని తెలుసుకోవచ్చు.

జీపీఎస్‌తో లొకేషన్‌ను ట్రాక్‌చేసి..

సీ-విజిల్ యాప్ ద్వారా పంపిన ఫోటోలు, వీడియోలు నేరుగా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమి షన్‌కు చేరుతాయి.జీపీఎస్ ద్వారా ఎన్నికల సంఘం అధికారులు మనం ఉన్న లోకేషన్‌ను ట్రాక్ చేస్తారు. ఇక ఆ ఫిర్యాదు నుంచి ఆ లోకేషన్ నుంచి జిల్లా కంట్రోల్ రూమ్‌కు వెళ్తాయి. వాటికి ఆ లోకేషన్‌కు దగ్గరగాఉండే ఎన్నికలబృందాలకు(ఎఫ్ఎస్‌టీ) సంబంధిత అధికారులు పంపిస్తారు. వెంటనే స్పెషల్ అధికారులు రంగంలోకి దిగి అక్రమాలను అడ్డుకుంటారు. ఎటువంటి చర్యలు తీసుకున్నారో ఫోటో, వీడియో రూపంలో తెలియజేస్తారు.

ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యం

సి-విజిల్ యాప్ నుంచి ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లోనే ఈ ప్రక్రియ అంతా జరు గుతుంది. ఫిర్యాదుచేసిన వెంటనే మన మొబైల్ నెంబరుకు ఒక యూనిక్ ఐడీ వస్తుంది. ఆ ఐడీ ద్వారా తర్వాత మనం ఇచ్చిన ఫిర్యాదు ఏ దశలో ఉంది. అధికారులు ఏ రకమైన చర్యలు చేపట్టారు అన్నది తెలుసుకోవచ్చు. అయితే ఎన్నికల్లో జరిగే అక్రమాలపై ఫిర్యాదులు చేసే వారి వివరాలను ఎన్నికల సంఘం అధికారులు గోప్యంగా ఉంచుతారు.

1905 కాల్ సెంటర్‌కు చేయవచ్చు

మొబైల్ యాప్ ద్వారానే కాకుండా 1950 నెంబరుకు ఫోన్‌చేసి కూడా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే టోల్‌ఫ్రీ నెంబర్ 18004256625ను కూడా సంప్రదించవచ్చు ఇంకా 08942-240589/ 29084 నెంబర్లను కూడా ఎన్నికల ఫిర్యాదుల కోసం అందుబాటులో ఉంటాయి. ఫిర్యాదుల పరిష్కారానికి నియోజకవర్గానికి మూడుచొప్పున ఏర్పాటుచేసిన ఎఫ్ఎస్‌టీ బృందాలు జీపీఎస్ వాహనాలతో ఫిర్యాదు ప్రాంతానికి నేరుగా వెళ్తాయి. వీటితోపాటు జిల్లాకు నియమితులైన ఆరుగురు ఎన్నికల పరిశీలకులను నేరుగా గానీ లేదా ఫోన్ ద్వారా కానీ ఫిర్యాదు చేయ వచ్చు. ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు తెలియజేయడంతోపాటు సూచనలు కూడా ఇవ్వవచ్చు.



కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

ఓటుహక్కు వినియోగించుకున్న సర్వీసు సిబ్బంది

- ఒకే బేస్ క్యాంపులో 81 మంది జవాన్లు



సిరా గుర్తును చూపిస్తున్న జిల్లా పారామిలటరీ సిబ్బంది

నరసన్నపేట, మే 3 : జిల్లాకు చెందిన 81 మంది పారా మిలటరీ సిబ్బంది తమ సర్వీసు ఓట్లను శుక్రవారం వినియోగించుకున్నారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం దుర్గ్ జిల్లా బిలాయ్ బేసి క్యాంపులో వీరంతా విధులు నిర్వహిస్తున్నారు. లోకసభ స్థానాలకు ఓటు హక్కు వినియోగించుక్నుట్లు వారు చెప్పారు. అలాగే, నరసన్నపేట, పలాస, ఇచ్ఛాపురం, ఆమదాలవలస అసెంబ్లీ నియోజవర్గాల అభ్యర్థులకు 71 మంది ఓటు వేసినట్లు పారా మిలటరీ సిబ్బంది తెలిపారు. బేస్ క్యాంపులో ఓటుహక్కు వినియోగించుకున్నట్లు చెప్పారు.

పల్లెల్లో అంతా గప్‌చుప్

(శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి)



ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. మైకుల హోరును పక్కన పెడితే ఓటర్ల పరంగా గ్రామాల్లో నిశ్శబ్ద వాతావరణం కనిపిస్తోంది. ఒక పక్క పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారంలో జోరు కనబరుస్తుంటే... పల్లె ఓటర్లు వారి పనుల్లోనే నిమగ్నమై ఉన్నారు. దీంతో గ్రామాల ప్రధాన కూడళ్లలో హడావుడి ఎక్కడా కనిపించడం లేదు. ఎన్నికల పిచ్చాపాటి మాటలు వినిపించడం లేదు. అసలు ఎన్నికల సమయమేనా అనే సందేహం కలుగుతోంది. దీంతో ఏ పార్టీకి ఎంత బలం ఉంటుందనే అంచనా అంతు చిక్కడం లేదు. అభ్యర్థి ప్రచారానికి వచ్చిన సమయంలో పార్టీ కార్యకర్తలే రోడ్డెక్కుతున్నారు. ఏ పార్టీకీ మాటల్లో కూడా మద్దతు తెలపడం లేదు. ఈ విధానం చూస్తుంటే గప్‌చుప్‌గా ఓటు వేసే పరిస్థితి కనిపిస్తోంది.

అభివృద్ధి చేతకాక వైసీపీ అసత్య ప్రచారాలు: గొండు శంకర్

అరసవల్లి: అభివృద్ధి, సంక్షేమం చేతకాక వైసీపీ నేతలు ఉమ్మడి మేనిఫెస్టోపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, వీటిని ప్రజలు వీటిని నమ్మే పరిస్థితి లేదని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని 31వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, నేతలు విభూది సూరిబాబు, పాండ్రంకి శంకర్, ఉమ్మడి పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే.. అరసవల్లిని అభివృద్ధి చేస్తానని కూటమి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. శుక్రవారం అరసవల్లికి చెందిన పలువురు యువకులు నగరంలోని విశాఖ-ఎ కాలనీ పార్టీ కార్యాల యంలో టీడీపీలో చేరారు. వారికి శంకర్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఎన్నేటి అప్పారావు, ఎన్నేటి బాబా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీతో యువతకు తీవ్ర నష్టం: కలమట

ఆంధ్రజ్యోతి శ్రీకాకుళం/అరసవల్లి: రాష్ట్రంలో వైసీపీ రాక్షస ప్రభుత్వంతో ముఖ్యంగా యువ తకు తీవ్రనష్టం వాటిల్లిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణ అన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 7న శ్రీకాకుళంలో నిర్వహిం చనున్న యువగళం కార్యక్ర మాని కి శుక్రవారం ఆయన శ్రీకాకుళం అసెంబ్లీ అభ్యర్థి గొండు శంకర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాక్షస ప్రభుత్వంగా వైసీపీ గుర్తింపు పొందిందని.. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ తీయ లేదన్నారు. నిరాశతో ఉన్న నిరుద్యోగ యువతను మేల్కొలిపి భరోసా కల్పించేందుకు నారా లోకేష్ జిల్లాకు వస్తున్నారన్నారు. లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంపీజే బాబు, విభూది సూరిబాబు, బొణిగి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



యువగళం ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా టీడీపీ అధ్యక్షుడు కలమట, పక్కన గొండు శంకర్

రాక్షస పాలనను తరిమికొట్టండి: కూన రవికుమార్

బూర్జ: రాష్ట్రంలో సాగుతున్న రాక్షస పాలనను ప్రజలు తరిమికొట్టాలని కూటమి అభ్యర్థి కూన రవి కుమార్ అన్నారు. అన్నవరంపేట, తిమడాం, టీడీఆర్‌పేట, తోటవాట, సింగన్నపాలెం, లచ్చయ్య పేట, ఓవీపేట, ఉప్పెనవలస, వైకుంఠపురం, బొడ్డపాడు, కొరగాం, అన్నంపేట, బొరగవలస, కటక మయ్యపేట తదితర గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రా నికి చంద్రబాబు సీఎం కావడం అవసరమన్నారు. రాష్ట్రాభివృద్ధి డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా సాధ్య మన్నారు. అనంతరం అయ్యవారిపేట నుంచి 40, నామాలక్ష్మీపురం నుంచి ఐదు, ఓవీ పేట నుంచి 20, కంట్లాం గ్రామం నుంచి ఐదు కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి రవి కుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. అన్నంపేట గ్రామంలో కూన రవికుమార్ రెండు కాళ్లులేని దివ్యాం గురాలిని పలకరించారు. కూటమిని గెలిపిస్తే శతశాతం దివ్యాంగులకు రూ.10 వేలు పింఛన్ ఇచ్చి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. ● **ఆమదాలవలస:** పట్టణంలోని 18 వార్డుల్లోని కంద్రపేటకు చెందిన పది ముస్లిం కుటుంబాలు మాజీ కౌన్సిలర్ బొడ్డేపల్లి లక్ష్మణ రావు ఆధ్వర్యంలో కూన రవికుమార్ సమక్షంలో చేరారు. షేక్ బకారి, అబ్బు తదితరులకే రవికుమార్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ● టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి కూన ప్రమీల పట్టణంలోని 13వ వార్డు పరిధిలోని విద్యా నగర్ కాలేజ్ రోడ్డు, కొత్తవారివీధి, దర్మారావు, క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



అన్నంపేటలో దివ్యాంగ వృద్ధురాలితో మాట్లాడుతున్న రవికుమార్

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి: గోవిందరావు



హిరమండలంలో ప్రచారం నిర్వహిస్తున్న మామిడి గోవిందరావు

హిరమండలం: ఎన్డీయే కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని పాతపట్నం నియోజకవర్గ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. శుక్రవారం హిరమండలంలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. ధరల పెరుగుదలతో సామాన్యుల నడ్డి విరిచారన్నారు. విద్యుత్ చార్జీలు, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఉద్యోగావకాశాలు లేక నిరుద్యోగులను నిండాముంచారని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సైకోను సాగనంపి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. హిరమండలంలో వైసీపీ గృహసారధి పాయల శంకరరావుతో పాటు పలు కుటుంబాలు గోవిందరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో జడ్పీటీసి బుచ్చిబాబు, బర్రి సురేష్, తేజ, లాడె కృష్ణ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పిస్తాం: ఎన్ఈఆర్, కలిశెట్టి

రణస్థలం: యువతకు అండగా ఉంటాం.. ఉపాధి కల్పిస్తాం.. రాజకీయా ల్లో మార్పు తీసుకొస్తామని ఎచ్చెర్ల నియోజక వర్గం ఎన్డీఏ కూటమి బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు, విజ యనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. శుక్రవారం పైడి భీమవరం, కోష్ట గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. స్థానిక పరిశ్రమలను అన్ని విధాలా అభివృద్ధి చేసి స్థానిక యువత ఉపాధి పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న ఎన్నికల్లో కమలం,సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు రౌతు శ్రీనివాసరావు, వడ్డాది శ్రీనివాసరావు, పిషిని జగన్నాథంనాయుడు, పైడి అప్పడుదొర, పిషిని అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు. ● రాష్ట్రానికి మళ్లీ చంద్రబాబును సీఎంగా చేస్తేనే సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడతాయని ఉమ్మడి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడు పేట, పూడివలస, కుశాలపురం, ఇబ్రహీంబాద్, బొంతలకోడూరు తదితర గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ పూర్వపు అధ్యక్షుడు చౌదరి నారా యణమూర్తి, కూటమి నేతలు బెందు మల్లేశ్వరరావు, వావిలపల్లి రామకృష్ణ, సంపతిరావు శ్రీనివాస రావు, గొలివి గోవిందరావు, అన్నెపు భువనేశ్వరరావు, గూరు జగపతిబాబు, తదితరులు పాల్గొన్నారు.



పైడిభీమవరంలో ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థులు ఎన్ఈఆర్, కలిశెట్టి అప్పలనాయుడు

గోవిందపురం సర్పంచ్ చేరిక

లావేరు: గోవిందపురం పంచాయతీ వైసీపీ సర్పంచ్ పిల్లా రాము, అనుచరులు 108 కుటుంబాలతో శుక్రవారం ఎన్డీఏ కూటమిలో చేరారు. ఎన్ఈఆర్ వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. చంద్రబాబు, మోదీ, పవన్‌కల్యాణ్ విధివిధానాలు నచ్చి కూటమిలో చేరి నట్లు పిల్లా రాము తెలిపారు. గోవిందపురం, ఇజ్జాడపాలేం, లుకలపుపేట, బర్లికం, రామునిపాలేం గ్రామలకు చెందిన వైసీపీ కుటుంబాలు ఎన్డీఏ కూటమిలో చేరాయి.

పార్టీ విజయానికి పనిచేయాలి: నాగార్జున

● కూటమి అభ్యర్థి బగ్గుతో కలిసి ప్రచారం

జలుమూరు, (సారవకోట): పార్టీ విజయానికి ఈ పది రోజులు క్యాడర్ కష్టపడి పని చేయాలని నియోజకవర్గ ప్రచార కన్వీనర్, విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. సవరడ్డపనస పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పదిరోజులు కీలక మని, అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి పాటు పడాలని కోరారు. అనంతరం గ్రామంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి, టీడీపీ నేతలు ధర్మాన తేజకుమార్, కత్తిరి వెంకటరమణ, సురవరపు తిరుపతిరావు, సాధు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

లింగాలవలస వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

జలుమూరు లింగాలవలస గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వెసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి నరసన్నపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి శుక్రవారం కండువాలు వేసి ఆహ్వానించారు. ● **పోలాకి:** పోలాకి మండల కేంద్రం నర్సాపురానికి చెందిన వైసీపీ నాయకులు, వార్డు సభ్యులు సనపల నారాయణరావు, మెట్ట తిరుమలరావు తదితరులు శుక్రవారం టీడీపీలో చేరారు. వీరికి ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని బగ్గు కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్య క్షుడు ఎంవీనాయుడు, నేతలు తెంబూరు నాయుడు, రాంబాబు, రాఘవరావు, బీజేపీ, జన సేన నాయకులు పాల్గొన్నారు. గొల్లలవలస, తోటాడ గ్రామాల్లో టీడీపీ ప్రచార కార్యదర్శి బగ్గు అర్చన ప్రచారం నిర్వహించారు.



పోలాకి: కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి

దుర్మార్గుడితో పోరాటంలో టీడీపీది పైచేయి కావాలి: అచ్చెన్న

టెక్కలి: సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఓ దుర్మార్గుడని, ఆ దుర్మార్గుడితో జరుగు తున్న ఈ ఎన్నికల పోరాటంలో టీడీపీది పైచేయి కావాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం నిమ్మాడలో టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల పాటు అనేక కష్టాలు అనుభవించాం.. ఒక్క వారం రోజులు గట్టిగా కష్టపడితే వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పవచ్చన్నారు. శనివారం నుంచి టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరిగే పోస్టల్ బ్యాలెట్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం పలువురు కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి వారం రోజుల పాటు కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

విశాఖ మాజీ డిప్యూటీ మేయర్ టీడీపీలో చేరిక

విశాఖ మాజీ డిప్యూటీ మేయర్, వైసీపీ సీనియర్ నాయకుడు దాడి సత్యనారాయణ శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నా యుడు ఆయనకు కండువా వేసి ఆహ్వానించారు. ఆయనతో పాటు విశాఖ తూర్పు నియోజక వర్గానికి చెందిన డాక్టర్ కంచికర్ల అచ్చుతరావు, పారిపల్లి రామారావు, జాతీయ మానవహక్కుల పరిరక్షణ సంస్థ ప్రతినిధి జనార్దన్, రవికుమార్, భగవాన్, గౌడుమణి బాలకృష్ణ తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసి ప్రజలపై పన్నుల భారం మోపిందని, సంపద సృష్టించడం, అది ప్రజలకు పంచడం టీడీపీతోనే సాధ్యమని, అందుకే తామంతా టీడీపీలో చేరుతున్నామని సత్యనారాయణ తెలిపారు. నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి మండలాల పరిధి కోటపాడు, కురుడు, శివరాంపురం, హర్షబాడ, దిమ్మిడిజోల, ఇజ్జువరం, నౌగాం, బన్నువాడ గ్రామాల నుంచి వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ● **నందిగాం:** రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని శివరాంపురం, సైలాడ, వల్లభ రాయుడుపేట, నరేంద్రపురం పంచాయతీల్లో ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మో హన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పి.అజయ్ కుమార్, పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ, ఎస్.జానకిరాం, ఎ.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.



మాజీ డిప్యూటీ మేయర్ సత్యనారాయణకు కండువా వేస్తున్న అచ్చెన్నాయుడు

నాలుగు తులాల పుస్తెల తాడు చోరీ

నరసన్నపేట: జమ్ము గ్రామంలో గురువారం రాత్రి ముసుగు దొంగలు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. సాధు లచ్చయ్యకు చెందిన ఇంటి తలుపులను గునపాంతో తొలగించేం దుకు ప్రయత్నిం చగా కుటుంబ సభ్యులు మేల్కొని కేకలు వేశారు. దీంతో దొంగలు పారి పోయిన గంట వ్యవధిలోనే వాన సింహాచలం ఇంటి తలుపులను పగులగొట్టి ఇంట్లో నిద్రి స్తున్న సింహాచలం కుమార్తె శిరీష మెడలోని నాలుగు తులాలు పుస్తెలతాడును దొంగి లించారు. ఆమెకు తెలివివచ్చి కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. గ్రామస్థులు పోలీసులు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. సింహాచలం ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడి మృతి

హరిపురం/మందస: మందస మండలం బాలిగాం సమీపంలో హైవేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయుడు అంకర బోయిన షన్ముఖరావు (45) శ్రీకాకుళంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పలాస నుంచి మందస వస్తుండగా జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో తలపై బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు హరిపురం ప్రభుత్వా సుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలిం చగా.. పరిస్థితి విషమించడంతో మృతిచెందారు. మందసకి చెందిన ఈయన పలాసలోని శాసనం ఎంపీ యూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అందరితో ఎంతో కలివిడి ఉండే షన్ముఖరావు మృతి చెందడంతో మందసలో విషాద చాయలు అలముకున్నాయి.

తాళ్లవలసకు చెందిన ఆటో డ్రైవర్..

రణస్థలం: తాళ్లవలస గ్రామానికి చెందిన మొంగం సాయికోటి (26) గడ్డి మందు సేవించి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం రణస్థలం మండలం బీరు కంపెనీ సమీపంలో గడ్డి మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తంగా 108 సహాయం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం అతని స్వగ్రామం తాళ్లవలసకు మృతదేహాన్ని తరలించారు.

చీపురుపల్లికి చెందిన వ్యక్తి..

మెళియాపుట్టి: రోడ్డు ప్రమాదానికి గురైన చీపురుపల్లి గ్రామానికి చెందిన నందిగాం మధుసూదనరావు(35) శ్రీకాకుళం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ టి.రాజేష్ తెలిపారు. మెళియాపుట్టి నుంచి పలాస వెళుతున్న అతనికి ద్విచక్రవాహనం ఢీకొనడంతో బలమైన గాయాలయ్యాయన్నారు. శ్రీకాకుళం తరలిం చగా అక్కడ మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలు

టెక్కలి: నౌపడా-మెళియాపుట్టి రోడ్డులో ఓ రైస్‌మిల్లులో పనిచేస్తున్న పోలాకి సుంద రమ్మ శుక్రవారం విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానిక మండా పోలం కాలనీకి చెందిన సుందరమ్మ రైస్‌మిల్లులో పనిచేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురైంది. ఇది గమనించిన కలాసీలు, తోటి సిబ్బంది మెరుగైన చికిత్స కోసం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

50 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

టెక్కలి: బూరగాం గ్రామానికి చెందిన పట్నాన వెంకటరమణ శుక్రవారం 50 మద్యం బాటిల్స్‌తో పట్టుబడినట్లు సెబ్ సీఐ జీఎస్ రాజశేఖర్‌నాయుడు తెలిపారు. అనుమానం వచ్చి ఆయన ఇంటిని తనిఖీ చేయగా విస్కీ 50 నిబ్బులు దొరికాయని, అతడిని అరెస్టు చేశామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామ సమీపంలోని మామిడి తోటలో ఒడిశా పాత్రపురం బ్లాక్‌కు చెందిన గందం దేవరాజు శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని రూరల్ ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. మృతుడి వయసు సుమారుగా 45 ఏళ్లు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. తాగుడుకు బానిసై ఇంటి నుంచి వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్‌ఐ పేర్కొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

ఇచ్ఛాపురం: శ్రీకాకుళం జిల్లా గార మండలం పొగాకువానిపేట గ్రామానికి చెందిన సీలాపు సూర్యనారాయణ(68) అదృశ్యం అయ్యారని అతని కుమారుడు ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. సూర్యనారాయణ ఇచ్ఛాపురం మండలం కేసుపురంలో మేస్త్రీ పనులు చేసేందుకు ఏప్రిల్ 25న వచ్చాడు. అదే రోజున మేస్త్రీ పనులకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గడ్డివాములు దగ్ధం

బూర్జ: అయ్యవారిపేట గ్రామస్థుడు లావేటి బాలరాజుకు చెందిన ఐదు ఎకరాల గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈ ఘటన శుక్రవారం జరగ్గా గుర్తించిన స్థానికులు అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. వాహనం వచ్చి మంటలను అదుపు చేసిం ది. అయినా గడ్డివాములు పూర్తిగా దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. గ్రామంలో కూన రవికుమార్ ప్రచారం ఉందని, తనపై వైసీపీ నాయకులు కక్ష కట్టి నిప్పు పెట్టించారని ఆరోపించారు. సంవత్సరం నుంచి పశువుల మేత కోసం గడ్డివాములు కల్లంలో ఉంచామని ఆవేదన వ్యక్తంచేశారు.

హింసకు తావులేని ఎన్నికలే లక్ష్యం

● ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ కమిషనర్ నితేష్ వ్యాస్

కలెక్టరేట్: రానున్న ఎన్నికల్లో ఎక్కడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా, రీ పోలింగ్ లేకుండా ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యం కావాలని భారత ఎన్నికల కమిషన్ సీనియర్ డిప్యూటీ కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. నాల్గోదశ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల పరిశీలకులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు శేఖర్ విద్యార్థి, పోలీసు అబ్జర్వర్ దిగంబర్ పి.ప్రధాన్, ఎన్నికల పరిశీలకులు సందీప్‌కుమార్, తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్ల, వ్యయ పరిశీలకులు శరవణకుమార్, కోమల్‌జిత్ మీనా, నవీన్‌కుమార్ సోని, జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్, ఎస్పీ జీఆర్ రాధిక తదితరులు హాజరయ్యారు.

పెన్షనర్ల డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలి

ఆమదాలవలస: పెన్షనర్ల డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని లక్ష్మీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో సంఘ అధ్యక్షుడు సురవరపు సిమ్మినాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. 2018 జూలై నుంచి 2023 డిసెంబర్ వరకు డీఏ, 2022 పీఆర్సీ బకాయిలు రావాల్సి ఉందన్నారు. తక్షణం వీటిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు, కోశాధికారి సత్యనారాయణ, పీఈవీఎన్ మాస్టార్, కె.షన్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు శుభరాట

నరసన్నపేట: స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18 నుంచి నిర్వ హించనున్న బహ్మోత్సవాలకు శుక్రవారం శుభరాట వేశారు. అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు, మావుడూరి జగదీష్, జగన్నాథ శర్మ ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. పదిరోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ధర్మకర్త పొట్నూరు చిన్నభద్ర వీరాస్వామి పాల్గొన్నారు.

సొండికుల కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి

టెక్కలి: రాష్ట్రంలో లక్షకు పైగా సొండి కులస్థులున్నారని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సొండికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్ చౌదరి, కార్యదర్శి బి.రాజారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందిం చారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సొండి కులస్థులను ఆదుకోవాలని కోరారు. కులవృత్తి కోల్పోయిన వారికి బ్రాందీ షాపుల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

పరిశోధనారంగం బలోపేతంపై ప్రత్యేక దృష్టి

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో పరిశోధనారంగం బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో నూతనంగా ప్రారంభించనున్న 'ఏ మల్టీ డిసిప్లినరీ ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఆఫ్ డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ యూనివర్సిటీ'పై శుక్రవారం చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. వర్సిటీలో ప్రత్యేక రీసెర్చ్ ఫోరం ఏర్పాటుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రీసెర్చ్ జర్నల్ సభ్యులు ఎన్.సంతోష్ రంగనాథ్, కె.శ్రీనివాసరావు, జి.రామకృష్ణ, జీఎల్‌వీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

99 శాతం హామీలకు జగన్ మంగళం: ఎంపీ

టెక్కలి: ఈ ఐదేళ్లలో 99 శాతం హామీలకు సీఎం జగన్ మంగళం పాడారని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి మండలం నారాయణ వలస, రేగులపాడు, తుంబయ్యపేట, కొప్పలపేటల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇచ్చిన జాబ్‌క్యాలెండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ అని దగా చేశారని, ఎస్సీ, ఎస్టీ విదేశీ విద్యకు జగన్ ప్రభుత్వం మంగళంపాడిందని విమర్శించారు. రానున్న ఎన్ని కల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా అచ్చెన్నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు కింజరాపు వరప్రసాద్, బోయిన గోవిందరాజులు, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, నంబాళ్ల శ్రీనివాస్, వెలమల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

పలాస: మందస మండలం లోహరి బంద పంచాయతీ శింక పుట్టుగ గ్రామా నికి చెందిన వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి శుక్రవారం టీడీపీలో చేరారు. వీరికి పలాస కూటమి అభ్యర్థి గౌతు శిరీష కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దున్న వాసుదేవ్, దిలీప్, తెలుకల లోకనాథం, దున్న కిరణ్, దున్న చరణ్‌తో పాటు పలువురు గ్రామ స్థులున్నారు. అలాగే కిల్లోయి గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు సవర ఉంగలాల్ తన అనుచరులతో టీడీపీలో చేరారు. ● **వజ్రపుకొత్తూరు:** హుకుంపేట, పూడిజగన్నాథపురం, కంబాల రాయుడుపేట, ఉద్దాన గోపీనాథపురంలో ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు సూరాడ మోహనరావు, మాజీ ఎంపీపీ జి.వసంత స్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పుచ్చ ఈశ్వర రావు, కణితి సురేష్ పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో పలాస అభ్యర్థి గౌతు శిరీష

కూటమి మేనిఫెస్టోతో వైసీపీ అవుట్: అశోక్



కవిటి: రాష్ట్రంలో కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోతో వైసీపీ ప్రభుత్వం అవుట్ అని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం కవిటి మండలం కె.కొత్తూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, బీజేపీ ఇన్‌చార్జి బుద్దాల నిర్మలారెడ్డి, జనసేన నాయకులు లోళ్ల రాజేష్, రంగారావు, బి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

గార: శ్రీకూర్మం క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పాలకొండకు చెందిన బలివాడ వేంకట మాధవ రావు రూ.50 వేలు విరాళాన్ని ఈవో గురునాథరావుకు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగి నర్సుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల ఆకస్మిక తనిఖీ

అరసవల్లి: రాష్ట్ర ఆరోగ్య, కుటుంబశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లో డీఎంహెచ్‌వో డా.బి.మీనాక్షి ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం ఫైర్ ఎన్‌వోసీ, అన్ని డాక్యుమెంట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏదైనా అగ్నిప్రమాదం సంభవించేటప్పుడు, ఆ ప్రమాదం నుంచి బయట పడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి సీపీ శ్రీదేవి, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తాబేళ్ల సంరక్షణతో పర్యావరణ సమతుల్యం

సోంపేట: తాబేళ్ల సంరక్షణతో పర్యావరణం సమతుల్యంగా ఉంటుందని కాశీబుగ్గ రేంజ్ ఆఫీసర్ ఎ.మురళీకృష్ణ అన్నారు. బారువ తీరంలో సముద్రపు తాబేళ్ల పిల్లలను శుక్రవారం విడిచిపెట్టారు. బారువ సెక్షన్ అధికారి వై.రాజేంద్ర, రాము, రాఘవయ్య, టి.సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

రైల్వేగేట్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

టెక్కలి: టెక్కలి-తెంబూరు రోడ్డు జంక్షన్‌లో శుక్రవారం సాయంత్రం పలాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సు రైల్వేగేటును ఢీకొంది. దీంతో ఒక్కసారిగా ట్రాఫిక్ స్తంభించింది. అక్కడున్న రైల్వే సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.